ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 30 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# ఏఈఈ నిఖేశ్ నివాసంలో ఏసీబీ సోదాలు

30 ప్రాంతాల్లో కొనసాగింపు

వ్యవసాయ భూములు, భవనాలు ఉన్నట్లు గుర్తింపు

ఆస్తుల మార్కెట్ విలువ రూ. 150 కోట్లకు పైనే..

హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నీటిపారుదల శాఖ ఏఈఈ నిఖేశ్ కుమార్ నివాసంలో ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి. నిఖేశ్ బంధువులతో పాటు సన్నిహితుల ఇళ్లలో కలిపి మొత్తం 30 ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. ఉదయం 6గంటల నుంచి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జరిపిన సోదాల్లో ఫాంహౌస్‌లతో పాటు భారీగా వ్యవసాయ భూములు, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. కేజీల కొద్దీ బంగారం ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటి వరకు గుర్తించిన ఏఈఈ ఆస్తులు మార్కెట్ విలువ ప్రకారం... దాదాపు రూ.150 కోట్ల కుపైనే ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. సోదాల అనంతరం పూర్తి వివరాలు వెల్ల డిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.



# యూజీసీలో చేర్చాలి

కోఠి మహిళా కళాశాల విద్యార్థినులు ఆందోళన

గేటు ఎదుట బైఠాయింపు

సీఎం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

హైదరాబాద్: కోఠి మహిళా కళాశాలలో... విద్యార్థినిలు ఆందోళనకు దిగారు. కోఠి మహిళ విశ్వవిద్యాలయాన్ని యూజీసీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ... తరగతులు బహిష్కరించి పెద్ద ఎత్తున కళాశాల గేటు ముందు బైఠాయించారు. గతప్రభుత్వం మహిళా విశ్వవిద్యాలయంగా నామకరణం చేసినా.. ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని విద్యార్థినిలు ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం.. దీనిని చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయంగా పేరు మార్చిందన్నారు. తమ డిగ్రీ పూర్తి అవుతున్న నేపథ్యంలో... ఇంతవరకు యూజీసీలో చేర్చకపోవడం వల్ల.. ఏ ప్రాతిపదికన సర్టిఫికెట్ ఇస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు, మూడు నెలల్లో డిగ్రీ పూర్తి అవుతుందని, తమ భవిష్యత్తు అయోమయంగా మారిందని వాపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని... మహిళా విశ్వవిద్యాలయాన్ని యూజీసీ లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు



# ఇండస్ట్రియల్ పార్క్

## భూసేకరణకు నోటిఫికేషన్ విడుదల

లగచర్లలో 110.32 ఎకరాలు, పోలెపల్లిలో 71.39 ఎకరాలు




రంగారెడ్డి : వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో బహుళార్ధక సాధక పారిశ్రామికవాడ ఏర్పాటు చేస్తూ.. భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. లగచర్లలో 110.32 ఎకరాలు, పోలెపల్లిలో 71.39 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు ప్రాథమిక ప్రకటన విడుదల చేసింది. గతంలో దుద్యాల మండలం హకీంపేట, లగచర్ల, పోలెపల్లి గ్రామాల్లో ఫార్మావిలేజ్ కోసం 1538 ఎకరాల భూసేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసిన సర్కారు...తదనంతర పరిణామాల నేపథ్యంలో దానిని ఉపసంహరించుకుంది. ఫార్మా విలేజ్ కు బదులుగా తాజాగా మల్టీపర్పస్ ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు కోసం భూములు సేకరించనుంది. కాలుష్యకారక ఫార్మా కంపెనీల కోసం భూములు ఇవ్వబోమని ఆయా గ్రామాల రైతులు విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో రేవంత్ సర్కారు ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. కాలుష్యం లేని, పర్యావరణహిత పరిశ్రమల ఏర్పాటుకే పారిశ్రామిక వాడ ఏర్పాటులో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పరిశ్రమల ఏర్పాటు ద్వారా కరవు పీడిత ప్రాంతమైన కొడంగల్ లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కాంగ్రెస్ సర్కారు యోచిస్తోంది.

# తమిళనాడులో వర్షాలు

చెన్నై విమానాశ్రయం మూసివేత



చెన్నై: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచే భారీ వర్షాలు మొదలైనట్లు తెలిపిన అధికారులు 12లక్షల కుటుంబాలను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను శిబిరాలకు తరలించినట్లు పేర్కొన్నారు. వారికి ఆహారం, తాగునీరు సహా అన్నిఏర్పాట్లు చేసినట్లు ప్రకటించారు. భారీవర్షాలతోపాటు గంటకు 90కి.మీ. వేగంతో గాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికతో తుపాన్ ప్రభావిత ప్రాంత జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించటంతోపాటు ఇతర సేవలను నిలిపేశారు. సముద్ర సమీప ప్రాంతాలకు వెళ్లకుండా బీచ్ రోడ్లను, పర్యాటక ప్రదేశాలను మూసివేశారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని...అధికారులు సూచించారు. జిల్లా కలెక్టరేట్లలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలకు సహాయపడేందుకు వీలుగా టోల్ ఫ్రీ నెంబర్లతోపాటు వాట్సప్ నెంబర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.చెన్నై విమానాశ్రయం మూసివేసినట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

# పాస్ పోర్టులు రద్దు

కేంద్రం నిర్ణయం

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వద్ద పిటిషన్ వేసిన ప్రభాకర్, శ్రావణ్ రావు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులోని నిందితులైన మాజీ పోలీస్ అధికారి ప్రభాకర్ రావు తోపాటు శ్రావణ్ రావు పాస్ పోర్టును కేంద్రం సస్పెండ్ చేసింది. పాస్ పోర్టును ప్రభాకర్ రావు సవాల్ చేశారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వద్ద ఇద్దరి న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. ఇద్దరి పాస్ పోర్టులను రద్దు చేయాలని పోలీసులు కోరారు. ఇంటర్ పోల్ ద్వారా ఇండియాకు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. రెడ్ నోటీసులు జారీచేసి హైదరాబాద్ కు రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే అమెరికా ప్రభుత్వానికి రాజకీయ శరణార్థిగా గుర్తించాలని పిటిషన్ వేయడం తెలిసిందే. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు సంబంధంలేదని బెయిల్ మంజూరు చేయాలని కోరుతున్నారు ప్రభాకర్ రావు.



# 'పుష్ప2' టికెట్ ధరల పెంపు

## డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల బెనిఫిట్ షో

అనుమతి ఇచ్చిన ప్రభుత్వం

5 నుంచి 8 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200..

(హైదరాబాద్): 'పుష్ప2: ది రూల్' డిసెంబరు 5న విడుదల కానుంది. తెలంగాణ వ్యాప్తంగా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల బెనిఫిట్ షోతో పాటు, అర్ధరాత్రి 1 గంట షోకు కూడా అనుమతి ఇచ్చింది. రాత్రి 9.30 షోకు టికెట్ ధరను అదనంగా రూ.800 పెంచింది. ఈ షో చూడాలంటే రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ ఏదైనా సరే ప్రస్తుతం ఉన్న టికెట్ ధరకు అదనంగా రూ.800 చెల్లించాల్సిందే. ఈ పెంపుతో సింగిల్ స్క్రీన్‌లో టికెట్ ధర సుమారు రూ.1000 అవుతుండగా, మల్టీప్లెక్స్‌లో రూ.1200లకు పైగా అవుతోంది. ఇక అర్ధరాత్రి 1 గంట నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు అదనపు షోలకు కూడా అనుమతి ఇచ్చారు. డిసెంబర్ 5 నుంచి 8 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచారు. డిసెంబర్ 9 నుంచి 16 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతి ఇచ్చారు. ఇక డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.20, మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



స్కైఫుడ్ కంపెనీలో

# ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్: జీహెచ్ఎంసీ ఆహార భద్రత అధికారుల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాజేంద్రనగర్ లోని స్కై ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీలో ఆహార భద్రతా అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అందులో తయారు చేస్తున్న చాకో పుట్ బాల్స్, చాకో కోన్స్, జెమ్స్ తదితర తినుబండారాలను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో వాటిని తయారు చేస్తున్నారని, సరైన రికార్డులు పాటించడం లేదని, లేబిలింగ్ లేదని గుర్తించారు. 950 కిలోల కోకో పౌడర్, 75 కిలోల రంగులు కలిపిన పంచదారను స్వాధీనం చేసుకుని నమూనాలను విశ్లేషణ కోసం ల్యాబ్ కు పంపించారు. నిబంధనలకు విరుద్ధంగా తినుబండారాలు తయారుచేస్తున్న స్కై ఫుడ్ సంస్థకు షోకాజు నోటీసులు జారీ చేశారు. నమూనా ఫలితాలు వచ్చాక యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతా అధికారులు తెలిపారు.



# యాషెస్ కంటే.. ఇండియా, ఆసీస్ పోరే బెస్ట్

ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్

ప్రపంచం: ప్రపంచ క్రికెట్‌లో భారత్ –ఆసీస్ పోరే అతి పెద్దదని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్ అన్నారు. 1992 తర్వాత భారత్ ఆసీస్ ఐదు టెస్టుల సిరీస్‌ను తొలిసారి ఆడటం బాగుందని పేర్కొన్నారు. ఆసీస్ ప్రైమ్‌మినిస్టర్స్ తో వార్మప్ మ్యాచ్ నేపథ్యంలో క్రికెటర్లను ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్ కలిశారు. భారత్, ఆసీస్ ప్రైమ్‌మినిస్టర్స్ జట్లతో మరోసారి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆటగాళ్లను ఉద్దేశించి ఆల్బనీస్ ప్రసంగించారు. ప్రపంచ క్రికెట్‌లో భారత్ –ఆసీస్ పోరే అతిపెద్దదని వ్యాఖ్యానించారు. ఇప్పుడు క్రికెట్‌ను చూసే వారి సంఖ్య బాగా పెరిగింది. ఐపీఎల్ మెగా లీగ్‌గా మారిపోయిందన్నారు. నేను కూడా ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి అహ్మదాబాద్ స్టేడియంలో మ్యాచ్‌ను చూశానన్నారు. టెస్టులను చూసేందుకూ ప్రేక్షకులు భారీగా వస్తున్నారు.